క్లుప్తంగా

ఆదాయం లెక్కింపు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా 2023 సంవత్సరానికి సంబంధించిన ఆదాయాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. జాతరకు సంబంధించి రూ. 21,36,760 జమ కాగా రూ. 20,58,861ఖర్చు అయ్యిందని, రూ.77,8,99 మిగిలిందని తెలిపారు. ఇంకా చందాలు వసూలు కావాల్సినవి రూ. 1,59,500 ఉన్నట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలి

అయిజ: పట్టణంలో కర్నూలు రోడ్డు సమీపంలో అక్రమంగా నిర్మించిన 56 షెటర్ల యజమానులపై చర్య తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు కౌన్సిలర్లు గిత్తల దేవరాజు, గోరంట్ల రాణెమ్మ, కలుకుంట్ల నాగమ్మ వినతిపత్రం అందజేశారు. అక్రమంగా నిర్మించిన షెటర్లను కూల్చివేస్తామని, దానికి సంబంధించిన వివరణ ఇవ్వాలని యజమానులకు నోటీసులు జారీచేసి చాలా రోజులైనా ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నడుచుకుంటామని, వారి ఆదేశాలను అమలు చేస్తామని ఆయన సమాధానమిచ్చారు.

ఆరోపణలు అవాస్తవం

గద్వాల రూరల్: దళితబంధు పథకంలో అవినీతి జరిగిందని ఎమ్మెల్యేలు, నాయకులు కమీషన్లు తీసుకున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ బి.రామేశ్వరి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దళితబంధు లబ్ధిదారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దళితులను కేవలం అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే పరిగణిస్తే సీఎం కేసీఆర్ అందుకు భిన్నంగా దళితులను ఆర్థికంగా ఎదిగేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. నాయకులు చిన్నయ్య, కురుమన్న, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

శాంతినగర్: ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు పొందిన మాన్‌దొడ్డి కార్యదర్శి దస్తగిరిని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు వెంకటేష్, ఆంజనేయులు శనివారం సన్మానించారు. నాయీబ్రాహ్మణుల ఖ్యాతిని దేశస్థాయిలో వినిపించారని అభినందించారు.

'ఎమ్మెల్యే తీరు సరికాదు'

శాంతినగర్: అవినీతి, ఇసుక అక్రమ రవాణా గురించి వరుస కథనాలు రాస్తున్నారనే విషయమై విలేకర్లపై దాడి చేయించిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహంకు దక్కుతుందని, ఈ తీరు సరి కాదని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నరసింహులు ఆరోపించారు. వడ్డేపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడాడు. ఇసుక, మట్టి మాఫియా, మరెన్నో పనులు అడ్డంపెట్టుకొని వసూలు చేసిన లంచాల గురించి సామాజిక మాధ్యమాల్లో బట్టబయలు అయ్యాయని, ప్రజలు అంతా గమనిస్తున్నారని, ఈ దందా ముగిసిపోయే సమయంలో దగ్గరపడిందని ఆయన ఆరోపించారు.

తప్పిన ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను బస్సు ఢీ కొన్న సంఘటన మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలం దువాసుపల్లికి చెందిన రైతు లక్ష్మీరెడ్డి, ట్రాక్టర్ డ్రైవర్ సురేష్‌తో కలిసి మిర్చిని మానవపాడులోని ఏసీ గోదాంలో ఉంచి తిరుగు ప్రయాణంలో మానవపాడు స్టేజీ నుంచి బోరవెల్లి మీదుగా దువాసుపల్లికి వెళ్తుండగా ఎక్స్ రోడ్డుపై మలుపు తిరుగుతుండగా హైద్రాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న బస్సు ట్రాక్టరును ఢీ కొట్టింది. బస్సులో 30 మందికిపైగా ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాక్టర్‌పై ఉన్న వ్యక్తికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనాథలకు అన్నదానం

అయిజ: మహిళ అభ్యుదయ సంస్థ సభ్యులు సునీత ఆమె స్నేహితురాలు సోమేశ్వరి జ్ఞాపకార్థం శనివారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో అనాథలకు అన్నదానం చేశారు. రెండేళ్ల క్రితం కరోనా సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సోమేశ్వరి కరోనా వైరస్ కారణంగా మృతి చెందిందని, ఆమె తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

ధరూరు: జేఈఈ మెయిన్స్‌లో ధరూరుకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు సాయి రాహుల్ సిద్ధార్థరెడ్డి 98.9 మార్కులు సాధించాడు. మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కూలిన భారీ వృక్షం



గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి కోర్టు కార్యాలయం ఎదుట ఉన్న ఏళ్ల నాటి భారీ వృక్షం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం కాలేదు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతం వర్షం పడుతుండడంతో జనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని న్యాయవాదులు చెప్పారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



గట్టులో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: పారిశుద్ధ్యం, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, వైకుంఠధామాలు.. ఇలా ఎన్నో పథకాలతో పల్లెల రూపురేఖలు మారాయని, అభివృద్ధిలో పల్లెలు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం గట్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 214 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని, రైతుల కోసం ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు బంధు పథకాలను అమలు చేస్తూ, దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. గతంలో ఆడపిల్లల పెళ్లికి తల్లిదండ్రులు తంటాలు పడేవారని, తాజాగా ప్రతి పేదింటి ఆడపడుచు పెళ్లికి కానుకగా సీఎం కేసీఆర్ రూ.లక్ష 116లను అందిస్తున్నట్లు తెలిపారు. బాలింతలకు కేసీఆర్ కిట్లు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తుందన్నారు.

చదువుకుంటేనే భవిష్యత్

చదువుతోనే భవిష్యత్ ఉంటుందని స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప తెలిపారు. ఆడపిల్లలంటే చులకన బావన వద్దని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచులు ధనలక్ష్మీ, హనుమంతు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

గద్వాల రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, ఆపద సమయంలో ఎంతో భరోసానిస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో గద్వాల, మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎల్‌వోసీ చెక్కులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, శ్రీధర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ మౌనిక

ఎర్రవల్లిచౌరస్తా: వరి పంటను కోసిన రైతులు వర్షానికి తడవకుండా ధాన్యాన్ని భద్రపర్చుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక సూచించారు. శనివారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురాన్ని ఆమె సందర్శించి వరి పంటను కోసిన రైతులకు పలు సూచనలు అందించారు. ప్రతి రైతు వరి కుప్పలు తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ధాన్యం సరైన తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. మరో రెండు రోజుల వరకు వర్ష సూచన ఉన్నందున రైతులు ఎవరూ కూడా వరి పంటను కోయరాదని సూచించారు.

ఐక్యతతో అభివృద్ధి సాధ్యం



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

అలంపూర్: ఐక్యతతోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపాలిటీలో చేపడుతున్న పలు పనులపై, చేపట్టాల్సిన పనులపై తీర్మానం చేశారు. ప్రధానంగా మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో రూ.2 లక్షలతో పనులు చేపట్టడానికి, 9వ ఇమాంపురం వార్డులో 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల కొత్త మోటార్ల కొనుగోళ్లకు తీర్మానం చేసినట్లు తెలిపారు. 2 వార్డులో దావీద్ ఇంటి నుంచి వెంకట్ రాముడు ఇంటి వరకు తాగునీటి పైప్‌లైన్ వేయనున్నట్లు తెలపిఆరు. వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఏఈ మేఘనాథ్ గౌడ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

డిజిటల్ గ్రీన్ బోర్డుల ఏర్పాటు



శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్‌లో గ్రీన్ బోర్డు ఏర్పాటుచేయిస్తున్న ఎంఈఓ నరసింహులు

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ గ్రీన్ బోర్డుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల శాంతినగర్‌లో ఎంఈఓ నరసింహులు ఆధ్వర్యంలో గ్రీన్ బోర్డు ఏర్పాటుచేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో శాంతినగర్, మండలంలోని రామాపురం, తనగల ప్రభుత్వ పాఠశాలలకు గ్రీన్ బోర్డులు మంజూరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎంలు విజయసారథిరెడ్డి, తేజ్యానాయక్ వున్నారు.

మేడేను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గద్వాల అర్బన్: మేడే వారోత్సవాలను కార్మికలోకం విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి చింతరేవుల కృష్ణ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో 138వ మేడేకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. వారోత్సవాలకు కార్మికులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్, రంగస్వామి, జమ్మన్న, రవి, పరుశరాముడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



నీలహళ్లిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ధరూరు: మండలంలోని నీలహళ్లిలో గత మూడు రోజులుగా నీటి సరఫరా నిలిపివేయడంతో గ్రామస్తులు శనివారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ వారం రోజుల క్రితం పగిలిపోయిందని, నాటి నుంచి ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేస్తామని పంచాయతీ అధికారులు తెలుపడం ధర్నాను విరమించారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలి

శాంతినగర్: వర్షాలతో ధాన్యం తడుస్తోందని, మొలకలు వచ్చే పరిస్థితి వుందని వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు శివారులో కల్లాల్లో నిల్వ చేసిన మొక్కజొన్న ధాన్యాన్ని శనివారం సాయంత్రం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు.

విద్యార్థుల ఎంపిక

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 4, 5వ తరగతికి సంబంధించి నాన్ మైనార్టీ విద్యార్థుల్లో 125 మందికిగాను డిప్ పద్ధతి ద్వారా 20 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ పద్మలత పేర్కొన్నారు. అధికారులు హవిలా రాణి, విజిలెన్స్, మహ్మద్ అలామ్ ఖాన్, జమీర్ ఖాన్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అయిజ: మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మొత్తం 92 మంది శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ముందుస్తుగా చెల్లించి పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వరకు ముందస్తు ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందని అన్నారు. మున్సిపల్ సిబ్బంది అందరూ ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించి ప్రజలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజలు సైతం ఆదివారం సాయంత్రం వరకు చెల్లించి రాయితీని పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, మేనేజర్ రాజేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, లైన్‌మెన్ నరసింహులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జెండాల తొలగింపుపై ఆందోళన

అలంపూర్: జేసీబీల సహాయంతో కూల్చిన కేవీపీఎస్, సీపీఎం జెండాలను అదే స్థలాల్లో తిరిగి ఏర్పాటుచేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌కు... ఏమెలమ్మ, వెంకటస్వామి, నాగరాజు, అయ్యప్ప, గంగన్న వినతిపత్రం అందజేశారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం మల్దకల్‌లోఅంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని, గర్భిణులు నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. డాక్టర్ అమూల్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు యామిని, తెల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక



రాష్ట్ర నాయకులతో మండలాల అధ్యక్షులు

అలంపూర్: ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జోగుల రవి తెలిపారు. అలంపూర్ మండల అధ్యక్షుడిగా మహేష్ యాదవ్, ఉండవెల్లి రాంరెడ్డి, మానవపాడు శేఖర్ రెడ్డి, ఇటిక్యాల రాజ్ కుమార్, రాజోలి సంధ్యబాబు, వడ్డేపల్లి కృష్ణకాంత్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా జిదేందర్, సహాయ కార్యదర్శిగా పులేందర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ నియమించి నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

అసమానతలు తొలగించడమే లక్ష్యం



అలంపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: అసమానతలు, అణచివేత, దొరల గడీల పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి తెలంగాణ భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనకం బాబు, మండల అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మే 7వ తేదీన బీఎస్పీ తెలంగాణ భరోసా యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలందరికి ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం అందడంతోపాటు.. ప్రతి ఒక్కరి అభ్యున్నతి బీఎస్పీ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం కావాలని, తెలంగాణ భరోసా యాత్రకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి ముఖ్య అతిధిగా హాజరువుతున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుంకన్న, లోకేష్ రెడ్డి, రాజు, ప్రకాశం, జయన్న, చిన్న నరసింహ, శాలు తిమ్మన్న, ఆనంద్, రఘువేంద్ర, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ముషాహిదాబేగం

మానవపాడు: ఉపాధిహామీ పనులు చేస్తున్న కులీలు జాగ్రత్తలు పాటించాలని జెడ్పీ సీఈఓ ముషాహిదా బేగం సూచించారు. శనివారం మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. నిర్దేషించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు.

అయిజ: నిబంధనల మేరకు చేయాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. శనివారం చిన్నతాండ్రపాడు గ్రామ శివారులో ఉపాధి హామీ కింద చేపడుతున్న ముళ్ల పొదల తొలగింపు పనులను ఎంపీడీఓ సాయిప్రకాష్ పరిశీలించారు.

సమస్యల పరిష్కారమే టీజేఎస్ ఎజెండా



టీజేఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ప్రకాష్‌గౌడ్

గద్వాల అర్బన్: తెలంగాణ జనసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీజేఎస్ జెండాను జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కరమే ప్రధాన ఎజెండాగా ప్రొఫెసర్ కొదండరాం సారథ్యంలో ఏర్పాటైన టీజేఎస్ నేటికి 5వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశామని, భవిష్యత్తులో చేస్తామన్నారు. అంతకు ముందు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వీరభద్రప్ప, వీరేష్, మహబూబ్ పాష, రాజు, వీరేష్ పాల్గొన్నారు.

రెండో రోజు జేపీఎస్‌ల నిరసన సమ్మె



అయిజలో కళ్లకు గంతలు కట్టుకొని సమ్మెలో పాల్గొన్న కార్యదర్శులు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె అన్ని మండలాల్లో రెండవ రోజూ కొనసాగింది. ఆయా ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో కళ్లకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై కూర్చొని, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసేలా జీఓను విడుదల చేయాలని, తమను రెగ్యులర్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమను కూడా గుర్తించి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలని పలువురు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మద్దూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా

మానవపాడు/ఉండవెల్లి/మల్దకల్: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని పలువురు అధికారులు తెలిపారు. శనివారం మానవపాడు, ఉండవెల్లి, మల్దకల్ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్లు ధరణిషా, జయంతి, ఆర్ఐ రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కలిపించిందని, కుల వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. అంటరానితనం వంటి అమానుషమైన చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిదేవి, ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఎంపీఓ పద్మావతి, ఎస్ఐ బాల్‌రాజు, ఆర్ఐ రాజేష్, సర్పంచు రాధ, ఏఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



గట్టులో నిరసన తెలుపుతున్న వీఓఏలు

గద్వాల అర్బన్/గట్టు/మల్దకల్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మె శనివారంతో 13వ రోజుకు చేరింది. గద్వాలలో భిక్షాటన చేస్తూ.. గట్టు, మల్దకల్‌లో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వీఓఏలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా కృషి చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, పదోన్నతులు, కనీస వేతనాలు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, వెంకట్రామయ్య, సురేష్, తాయప్ప, భాష, చంద్రాములు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి శేషంపల్లికి చెందిన నందివర్ధన్‌రెడ్డి, శ్రీధర్ దంపతులు 750 గ్రాముల వెండి పళ్లెంను స్వామి వారికి బహుకరించారు.అలాగే, ఆలయ ఆవరణలో శేషదాసుల వారి ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్బంగా శేషదాసుల వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గద్వాలలో వాసవి మాత స్వర్ణోత్సవాలు

గద్వాల: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి స్వర్ణోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో రెండో రోజు కొనసాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో చేపట్టిన విశేష పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, జంబు రామన్‌గౌడ్, రాము, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడి తరలింపు

గద్వాల అర్బన్: గద్వాల రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్న ఓ బాలుడిని బాలల సంరక్షణ విభాగానికి తరలించారు. డీసీపీఓ నర్సింహ తెలిపిన వివరాలిలా.. ఈ నెల 28న స్టేషన్‌లో ఎనిమిదేళ్ల బాలుడు అయోమయంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు గుర్తించారు. వెంటనే బాలల సంరక్షణ విభాగ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్‌కు తీసుకొచ్చి ఆరా తీశారు. బాలుడి పేరు అంజి అని, తల్లి పేరు లక్ష్మీ అని చెబుతున్నాడని, సంబంధీకులు ఎవరైన ఉంటే బాలరక్షక్ భవన్‌లో సంప్రదించాలన్నారు.

గడువు పొడగింపు

గద్వాల రూరల్: గద్వాల శివారులో సర్వే నంబర్లు 968, 969, 980,983,984, 985లలో ఇళ్లస్థలాల పట్టాలు పొందిన వారు తమ వద్దనున్న ప్లాట్ల ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులం సర్టిఫికెట్(ఎస్సీ, బీసీ మాత్రమే) జిరాక్సు కాపీలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తహశీల్దార్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువును మే 6వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

గద్వాల: వట్టెం జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 5 పరీక్ష కేంద్రాలలో మొత్తం 985 మంది విద్యార్థులకు గాను 897 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 88 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. డీఈఓ సిరాజుద్దీన్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఆయా మండలాల ఎంఈఓలు ప్రవేశ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.